# వరికూటి నామినేషన్‌కు పోటెత్తిన అభిమాన జనం

వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు నామినేషన్ కార్యక్రమం జనసంద్రాన్ని తలపించింది.వేలాదిగా తరలివచ్చిన అభిమానుల కోలాహలం మధ్య వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీ మోపిదేవితో కలిసి ఆర్వో వసంతరాయుడుకు అశోక్‌బాబు నామినేషన్ సమర్పించారు. వేమూరు, కొల్లూరు మండలాల నుంచి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తండోపతండాలుగా తరలివచ్చారు. కొల్లూరు, వేమూరు మండలాలు జై జగన్, జై వరికూటి నినాదాలతో హోరెత్తాయి. నియోజకవర్గంలోని చుండూరు, వేమూరు, అమృతలూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల నుంచి జనం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కొల్లూరు అనంతభోగేశ్వరాలయం, కూచిపూడిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, ఎస్సీ కాలనీలోని పలు చర్చిలు, మసీదుల్లో వరికూటి దంపతులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. మండే ఎండలను సైతం లెక్క చేయకుండా అభిమానులు ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

– వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు



కొల్లూరు ఎస్సీ కాలనీలో వరికూటిపై పూలు జల్లి అభిమానం చాటుకున్న మహిళలు



అమర్తలూరు మసీదులో ప్రార్థనలో వరికూటి అశోక్‌బాబు



కొల్లూరు అనంత భోగేశ్వరాలయంలో పూజల్లో వరికూటి దంపతులు



ర్యాలీలో నినాదాలు చేస్తున్న మహిళలు

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 26, 27 తేదీలలో తెనాలి నుంచి రేపల్లె మధ్యలోని 132 కేవీలైన్‌లో అదనంగా వేరొక కొత్తలైన్ ఏర్పాటు చేయటం జరుగుతుందని పట్టణ ఏఈ ఏడుకొండలు గురువారం తెలిపారు. దీని కారణంగా నేడు తెనాలి–రేపల్లె మధ్యలోని పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ప్రాంగణ నియామకాలకు విద్యార్థుల ఎంపిక

చెరుకుపల్లి: విద్యార్థులు చదువులు కొనసాగిస్తుండగానే ఉద్యోగ అవకాశాలు రావటం అభినందనీయమని శివాని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ యు రత్నకుమార్ అన్నారు. మండలంలోని పొన్నపల్లి శివాని డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా లో వివిధ ప్రముఖ కంపెనీల ప్రముఖులు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూలలో శివాని డిగ్రీ కళాశాల నుంచి వివిధ కంపెనీలలో 37 మంది ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పైనం ఏడుకొండల రెడ్డి, డైరెక్టర్ రామరాజు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

### నియోజకవర్గంలో 24 నామినేషన్లు దాఖలు

వేమూరు: సార్వత్రిక ఎన్నికలకు వేమూరు నియోజకవర్గం నుంచి 24 నామినేషన్లు దాఖలు చేశారని నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వరికూటి అశోక్ బాబు, తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా నక్కా ఆనంద్‌బాబు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బూర్ల సుబ్బారావు, జై భారత్ పార్టీ అభ్యర్థిగా డి భాగ్యారావు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు 17 మంది 24 నామినేషన్లు వేశారని ఆయన తెలిపారు.

### పెదపులివర్రులో గోగులమ్మ వార్షిక మహోత్సవాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలలో భాగంగా గురువారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. గ్రామానికి చెందిన భక్తులే కాక చుట్టు పక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను యాజ్ఞికులు ఆమంచి సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు దీవి రాంబాబు, దీవి గోపాల కృష్ణమాచార్యులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఈ మహోత్సవాలలో విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన భట్టిప్రోలు విద్యార్థి



వేల్పూరి తనిష్క్

భట్టిప్రోలు: భట్టిప్రోలుకు చెందిన వేల్పూరి తనిష్క్ జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటాడు. గురువారం విడుదలైన ఫలితాల్లో విజయవాడ నారాయణలో ఇంటర్మీడియట్ చదివిన తనిష్క్ 98.90 పర్సంటేజ్ సాధించి ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో 17,616, ఈడబ్ల్యుఎస్ క్యాటగిరిలో 2,675 ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా విజయవాడ నారాయణ–శ్రీకరి భవన్ (పోరంకి) యాజమాన్యం తనిష్క్‌ను అభినందించారు. తనిష్క్ తల్లిదండ్రులు వేంకట నాగలక్ష్మి భారతమ్మ, నాగేశ్వరరావులు భట్టిప్రోలులో సిద్ధార్థ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లుగా వ్యవహరిస్తున్నారు. సత్తా చాటిన తనిష్క్‌ను పలువురు అభినందించారు. ఇతని విద్యాభ్యాసం పదో తరగతి వరకు భట్టిప్రోలు సిద్ధార్థ హైస్కూల్‌లో కొనసాగింది.

### రూ. 2.50 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: ఎన్నికల ప్రవర్తన నియామావళిలో భాగంగా ఎన్నికల అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనధికారికంగా తరలిస్తున్న రూ.2.50 లక్షల నగదును గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల మేరకు..ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. లాం గ్రామం సమీపంలో షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి ఎలాంటి రశీదులు లేకుండా కారులో లక్ష రూపాయలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. కంతేరు శ్రీసిటీ సమీపంలో తాడికొండ గ్రామానికి చెందిన తాడిబోయిన ప్రసాదు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రూ.1.50లక్షల నగదు తరలిస్తూ సరైన రశీదులు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తదుపరి విచారణ నిమిత్తం సంబంధిత నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

## ముగిసిన నామినేషన్‌ల స్వీకరణ

- చివరిరోజు 14 నామినేషన్‌లు దాఖలు
- మొత్తం 18 మంది అభ్యర్థుల నుంచి 35 నామినేషన్‌లు
- నామినేషన్‌లు వేసిన వారిలో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్‌ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్‌ల స్వీకరణలో చివరిరోజు 14 నామినేషన్‌లు దాఖలయ్యాయి. స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి మొత్తం 35 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మొత్తం 18 మంది అభ్యర్థుల నుంచి 35 నామినేషన్‌లు దాఖలయ్యాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ 4 సెట్లు, డాక్టర్ ఈవూరు సృజన్ 1 సెట్టు, టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ 4 సెట్లు, అనగాని మంజుల 2 సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావు 2 సెట్లు, మోపిదేవి మానిష్ 1 సెట్టు, బీఎస్పీ అభ్యర్థి డొక్కా శ్రీనివాసరావు 3 సెట్లు, ఇండియన్ యూనియన్ ముస్లిం పార్టీ అభ్యర్థి షేక్ అసీనా 1 సెట్టు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి యడ్ల గోపీరాజ్ 1 సెట్టు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి అంగిరేకుల ఆదినారాయణ 2 సెట్లు, ఇండియన్ ప్రజాబంధుపార్టీ అభ్యర్థి మొరుగుపాల సదాశివ రావు 2 సెట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి బెల్లంకొండ సుబ్బారావు 1 సెట్టు, జైభారత్ నేషన్ పార్టీ అభ్యర్థి అంద్రాజు రామరాజు 2 సెట్లు, జైభీమ్ భారత్ పార్టీ అభ్యర్థి దోవారమేష్ రాంజీ 1 సెట్టు చొప్పున నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా బొర్రా శ్రీనివాసరావు 4 సెట్లు, మహ్మద్ ఖాసిం 2 సెట్లు, కొక్కిలిగడ్డ రాంబాబు, బొడ్డు నాగేశ్వరరావులు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. 26వ తేదీన నామినేషన్‌ల పరిశీలన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

## అశోక్‌బాబు నామినేషన్‌కు తరలిన పార్టీ శ్రేణులు



పెదలంక నుంచి అశోక్‌బాబు నామినేషన్‌కు తరలుతున్న పార్టీ శ్రేణులు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు నామినేషన్ కార్యక్రమానికి భట్టిప్రోలు మండలం నుంచి అధిక సంఖ్యలో అభిమానులు, నాయకులు తరలి వెళ్లారు. కొల్లూరు మండలం ఇందిరా కాలనీ నుంచి నిర్వహించిన ర్యాలీలో భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి చెందిన డాక్టర్ చిలుమూరు రామ్మోహన్ రావు, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), ఈడిగ, అగ్నికుల, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు పి. శ్రీనివాసరావు, శేరు శ్రీనివాసరావు, భట్టిప్రోలు గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, మాజీ జెడ్పీటీసీ బండారు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, గద్దె సుశీల, మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, పల్లెకోన, రాచూరు, అళ్లమూడి, సూరేపల్లి, చింతమోటు, పెసర్లంక, సర్పంచులు బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, జె. రాధాకృష్ణమూర్తి, పి.రాంబాబు, ఎం.విజయలక్ష్మి, గుమ్మడి శంకరరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, పట్టణ, గ్రామ కన్వీనర్లు కుందేటి రమేష్, కొనకాల శ్రీనివాసరావు, వేల్పూరి చిన్నారి, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీల పర్యవేక్షణలో పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా ర్యాలీలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## బాల్యం నుంచే ఆధ్యాత్మిక విద్యను నేర్పించాలి



భగవద్గీతపై చిన్నారులకు అవగాహన పరుస్తున్న చిలుకోటి లక్ష్మీనారాయణ

చెరుకుపల్లి: చిన్నతనం నుంచే విద్యార్థులకు ఆధ్యాత్మిక విద్యను అలవర్చటం ద్వారా వారిలో భక్తి భావం, సామాజిక చైతన్యం అలవడతాయని భగవద్గీత శిక్షకులు చిలుకోటి లక్ష్మీ నారాయణ అన్నారు. మండలం కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 25వ తేదీ గురువారం నుంచి మే 19వ తేదీ వరకు బాలల వేసవి భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుందని వేసవి భగవద్గీత శిక్షణ కమిటీ సభ్యుడు ఉప్పు సాంబశివరావు తెలిపారు. ఈ వేసవి భగవద్గీత శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. దీనితో పాటు చిన్నారులకు డ్రాయింగ్, యోగా తరగతులు నిర్వహించి వారికి మే 18న పోటీలు నిర్వహించి 19న బహుమతులు అందజేయటం జరుగుతుందని సాంబశివ రావు తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు వయసుతో తారతమ్యం తేదని ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 9గంటల వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. వేసవి కాలంలో నిర్వహించే ఈ భగవద్గీత, యోగా, డ్రాయింగ్ శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి, కాగ్నిజంట్ ఇన్‌సైట్ స్కూల్ చైర్మన్ మరివాడ శివప్రసాద్, విస్సంశెట్టి శ్రీనివాసరావు, దొంతిరెడ్డి సింగారెడ్డి, పిట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, చిన్నారులు పాల్గొన్నారు.

## ఓటు వేయడం బాధ్యతగా గుర్తెరగాలి



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ శేషన్న, కుమార్ పంప్స్ అధినేత సుబ్రమణ్యం

తెనాలిఅర్బన్: ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. స్విప్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ ఇండస్ట్రీలో గురువారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఓటు హక్కును ప్రతి పౌరుడికి కల్పించిందని తెలిపారు. ఆ హక్కును అందరూ బాధ్యతతో వినియోగించుకోవాలన్నారు. భావి తరాలకు మంచి భవిష్యత్‌ను అందించాలంటే మంచి పాలకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె అనూషా, ఏసీపీ సుబ్బారావు, కుమార్ పంప్స్ ప్రతినిధులు కొత్త కృష్ణ కుమార్, కొత్త హరి కుమార్, జనరల్ మేనేజర్ వి రాజేంద్రప్రసాద్, జి శేషగిరిరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు రామచంద్రరావు, వై అనుపమ, కార్మికులు పాల్గొన్నారు.

## దోమల నివారణతో వ్యాధులు దూరం



చందోలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రేపల్లె రూరల్: దోమల నివారణతో అనేక రకాల వ్యాధులను నిర్మూలించవచ్చని ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు చైతన్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. తేమ, నీటి నిల్వలు ఉన్న వాతావరణంలో దోమల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా పర్యవేక్షించుకోవటంతో పాటు మురుగు కాలువలలో చెత్త నిల్వలు పడవేయకుండా మురుగు నీరు పారుదల అయ్యే విధంగా సరి చూసుకోవాలన్నారు. కాల్వలలో దోమ లార్వాపై ఆయిల్‌ను పిచికారి చేయటంతో దోమ లార్వా మృతి చెందుతుందన్నారు. దోమల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు జీవన్, శ్రీమన్నారాయణ, మలేరియా యూనిట్ అధికారులు వైవి కృష్ణయ్య, ఎం.ఎల్లయ్య, జీ.చక్రధర్, డీపీఎంవో పి.వెంకటేశ్వరరావు, సారంగపాణి, మార్తమ్మ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

**అర్బన్ హెల్త్ సెంటరులో..**

ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్‌లోని అర్బన్ హెల్త్ సెంటరులో ర్యాలీ నిర్వహించారు. దోమకాటుతో కలిగే వ్యాధులను, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ యల్లయ్య వైద్యశాలలోని రోగులకు, పరిసర ప్రాంతంలోని ప్రజలకు వివరించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కృష్ణయ్య, హెల్త్‌సెంటర్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, సిబ్బంది శిరీష, తిరుపతమ్మ, నరేంద్ర, రామాజీ తదితరులు పాల్గొన్నారు.

**దోమల నివారణకు చర్యలు చేపట్టాలి**

పిట్టలవానిపాలెం: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రిక మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా మలేరియా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లోకేష్, సూపర్‌వైజర్ నరసింహారావు, హసన్, వేదమణి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వివరాల సేకరణకు నేడు ఆఖరు

నెహ్రూ నగర్: ఎన్నికల విధులలో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం చివరి రోజు అని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కె.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ని తొలుత ఈ నెల 22వ తేదీలోపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రస్తుతం 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం(94) పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు (వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు మొదలుగు వారు) వారి ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నప్పటికి, జీఎంసీలోని ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ వద్ద ఫారం–12 కు సంబంధించిన వివరాలు అందించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 26వ తేదీ శుక్రవారం లోగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్‌లో ఫారం–12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం–12తో పాటు ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని వివరించారు.

## ఈఎస్ఐ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం

తెనాలి: ఈఎస్ఐ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలో గల శ్రీ చైతన్య పాఠశాలలు, శ్రీ చైతన్య జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఈఎస్ఐ చందాదారులు, కుటుంబ సభ్యులకు నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు చేశారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. డాక్టర్ మాధవి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ ఫణీందర్ వైద్య పరీక్షలు చేశారు. అక్కడే అవగాహన సదస్సును జరిపి ఈఎస్ఐ స్కీము ద్వారా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య శిబిరానికి 300 పైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరైనట్టు చైతన్య పట్టణ ప్రిన్సిపాల్స్ బి.తిరుపతిరావు, నన్నపనేని సునీల్‌కుమార్ తెలిపారు.

### ఎమ్మెల్యే అభ్యర్థి కోనకు అండగా నిలుస్తాం

బాపట్ల: బాపట్ల పట్టణంలోని కాకుమానువారిపాలెంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారానికి అనూహ్య స్పందన దక్కింది. జీఎస్ఆర్ బిల్డర్స్ అధినేత గుంట్రెడ్డి శివ ఆధ్వర్యంలో పార్టీ ప్రచారానికి వచ్చిన సినీ రచయిత కోన వెంకట్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు పొందిన సంక్షేమ పథకాలను నాయకులకు వివరించి ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతికి అండగా ఉంటామని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, నాయకులు పెరుమాళ్ళ గోపి, పంకం నాగేశ్వరరావు, గణేషుల శివరామకృష్ణ, కాకుమాను శివనాగేశ్వరరావు,శివబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

### పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

బాపట్ల: బాపట్ల పట్టణంలో వివిధ విద్యా సంస్థల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు విద్యా సంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్లుపల్లి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అశోకా కన్వెన్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం 5గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 550 మార్కులకు పైబడిన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. పదో తరగతి మార్కుల జాబితా(ఇంటర్నెట్ కాపీ) తీసుకుని 9100069428, 8978480437 నెంబర్లులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రతిభా పురస్కారాలతో పాటు నగదు బహుమతి ఉంటుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### మే1 నుంచి ఉచిత వేసవి శిక్షణ శిబిరం

తెనాలి: పట్టణానికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి ఆరంభించనున్నారు. అన్ని వయసుల బాలికలు, స్త్రీలు, 11 ఏళ్లలోపు బాలురకు మాత్రమే ఏర్పాటు చేస్తున్న ఈ శిక్షణ శిబిరం జూన్ 5వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల్నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కన్నెగంటి రామరాయ చౌదరి ఒక ప్రకటనలో తెలియజేశారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల కొనసాగింపు కోసం ఈ శిబిరంలో యోగ, కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, చిత్రలేఖనం, సంస్కృతం, తెలుగులో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రేపు గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

తెనాలి: శ్రీసరస్వతీ శిశుమందిర్ గ్రాడ్యుయేషన్ డే సంబరాలను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు శిశుమందిర్ సంచాలిత సమితి, పాఠశాల అభివృద్ధి కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశాయి. ఆరోజు సాయంత్రం 4 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటయ్యే సభకు సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహిస్తారు. గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కోదూరు రమాదేవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, శ్రీసరస్వతీ విద్యాపీఠం–విజయవాడ సమితి కార్యదర్శి కొసనం జగదీష్, పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు, కార్యదర్శి దూళ్ల నరసింహారావు పాల్గొంటారని వివరించారు.

## సంక్షేమ సారథి జగనన్నకు పట్టం కడదాం



బుద్ధాంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోన వెంకట్

కర్లపాలెం: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ అన్నారు. బాపట్ల అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి, పార్లమెంటు అభ్యర్థి నందిగం సురేష్‌ల తరఫున గురువారం బుద్ధాం గ్రామంలో సినీ రచయిత కోన వెంకట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునేందుకు కోన రఘుపతిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వెంకట్ చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, సర్పంచ్‌లు అంకమ్మ, భానుప్రసాద్, ఎంపీటీసీలు గొర్ల కమల, ఆసిఫ్ అలీ, నాయకులు గొర్ల సుబ్బారావు, బుల్లెట్ నాగరాజు, కె.హరిబాబురాజు, కంకిపాటి నాగరాజు, నాగేశ్వరరెడ్డి, మీరయ్య, మనోహర్, సాగర్, బెనర్జి, నాగరాజురెడ్డి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

**బాపట్ల అభివృద్ధి కోనకే సాధ్యం**

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా అభివృద్ధి కోన రఘుపతికే సాధ్యమని బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ అన్నారు. మండలంలోని పిట్టువారిపాలెం, చందోలు గ్రామాలలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను 99.5 శాతం అమలు చేసి నవరత్నాల రూపంలో సంక్షేమాన్ని ప్రజలకు అందించి ఎన్నికలకు వెళ్తున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లాను సాధించడంతో పాటు వైద్య కళాశాలను సైతం బాపట్లలో ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతిని మూడవసారి ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కోన రఘుపతిని గెలిపించాలని కోరారు.ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్విని రెడ్డి, మాజీ ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, మునీర్, పార్టీ రాష్ట్ర నాయకులు అహ్మద్‌హుస్సేన్, చల్లాపల్లి విజయరాజు, చేబ్రోలు వీరయ్య, కరీమున్నాసా, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, శ్యామల నాగిరెడ్డి, కూనంపూడి దేవేంద్రరాజు, కుంతం ప్రసన్నరాజు, మండే విజయ్‌కుమార్, డి.కోటిరెడ్డి, బడుగు ప్రకాశరావు, సుబ్రమణ్యంరెడ్డి, బొలగాని సుబ్బారావు, సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

## తెనాలిలో కొత్త సినిమా షూటింగ్

తెనాలి: శ్రీ కృష్ణ ఆర్ట్స్ పతాకంపై పట్టణానికి చెందిన దర్శకుడు కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో ఆరంభించిన నూతన సినిమా షూటింగ్ గురువారంతో తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తెనాలి, పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. ఎడ్యుకేషన్, సైన్స్, పురోగతి అనే అంశాలపై ప్రధానంగా సినిమా ఇతివృత్తం ఉంటుందని రత్నాకర్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో మరో రెండు షెడ్యూల్స్‌తో చిత్రీకరణ పూర్తవుతుందనీ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు అనంతరం నవంబరులో విడుదల చేస్తామన్నారు. కేజీఎఫ్ ఫేమ్ చైల్డ్ సూపర్ స్టార్ లిటిల్ భాను, మాస్టర్ పుష్కర్‌లు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, బెల్లంకొండ వెంకట్, గోమతి, మధుకర్, వసంత యామిని, రాధ, అలపర్తి వెంకటేశ్వరరావు, గురుబ్రహ్మం, అజయ్ ఇండియన్, లక్ష్మి, తులసి ఇతర పాత్రల్లో నటిస్తున్నారని తెలిపారు. సాధు సుస్మిత, కన్నెగంటి రవి, కె.ధీరజ్‌లు నిర్మాతలు కాగా సినిమాటోగ్రఫీ వరప్రసాద్‌రెడ్డి, ఆర్ట్ వెంకట్, అసోసియేట్ డైరెక్టర్ రమణ, స్టిల్స్ సీహెచ్ శేఖర్, ప్రొడక్షన్ మేనేజర్ మునిపల్లి శ్రీకాంత్‌గా వివరించారు.